క్లుప్తంగా

ఘనంగా పారువేట ఉత్సవం

పగిడ్యాల: తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లోని నాగేశ్వరస్వామి, నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల వద్ద గురువారం పారువేట ఉత్సవాలను పురోహితులు సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. పారువేట ఉత్సవ మూర్తిని అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం పారువేట గొర్రెను వదిలారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రిటైర్డ్ వీఆర్ఓ మృతి

ఆత్మకూరురూరల్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్ఓ ఎస్ లింగారెడ్డి (75) వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బుధవారం సాయంత్రం మృతి చెందారు. గురువారం జరిగిన ఆయన అంత్యక్రియలకు వైఎస్సార్ సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భునేశ్వరరెడ్డి హాజరై నివాళులర్పించారు. లింగారెడ్డి అంత్యక్రియల్లో జెడ్పీటీసీ సభ్యులు శివశంకర రెడ్డి, నాయకులు రాజమోహన్ రెడ్డి, ప్రభాకరరెడ్డి, విజయ్ చౌదరి, రామచంద్రుడు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో అంతర్రాష్ట్ర ఆరు పళ్ల వృషభాల బండలాగుడు పోటీలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరునాలను పురస్కరించుకుని ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారు శివలక్ష్మమ్మకు అందజేశారు.

అటెండర్ మృతి



పవన్‌కుమార్ యాదవ్(ఫైల్)

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ అటెండర్ పవన్‌కుమార్ యాదవ్(22) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. కొత్తపల్లికి చెందిన బాలీశ్వరయ్య పాములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ 14 మాసాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అతని ఉద్యోగం చిన్న కుమారుడు పవన్‌కుమార్‌యాదవ్‌కు ఇచ్చారు. అతను జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో 2024 జూన్‌లో అటెండర్‌గా చేరి విధులు నిర్వహిస్తుండగా మూడు మాసాల క్రితం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. తండ్రి మరణించిన 14 మాసాలు గడవక ముందే కొడుకు మృతిచెందటంతో తల్లి శివజ్యోతి, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అతని స్వగ్రామం కొత్తపల్లికి మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీడీఓ గోపికృష్ణ, ఏఓ నూర్జహాన్, సీనియర్ అసిస్టెంట్ మద్దమ్మ, కంప్యూటర్ ఆపరేటర్ సందీప్ తదితరులు పవన్‌కుమార్‌యాదవ్ మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నిప్పులవాగుకు 15 క్యూసెక్కుల నీటిసరఫరా

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు కేవలం 15 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి 490, మల్యాల ఎత్తిపోతల నుంచి 338 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 670 క్యూసెక్కుల నీరు చేరుతుండగా అందులో నిప్పులవాగుకు 15 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 655 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఏబీఆర్ కాల్వకు సాగునీటిని బంద్ చేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ విజేత కొత్తపల్లి



కబడ్డీ విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లి: పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి తిరునాల సందర్భంగా మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో కొత్తపల్లి జట్టు నిలిచి రూ.15,000 బహుమతి బహుమతిని కైవసం చేసుకుంది. రెండువ స్థానంలో కొత్తపల్లి మస్తాన్ జట్టు(రూ.10,000), మూడవ స్థానంలో ఆత్మకూరు హనుమాన్ జట్టు(రూ.5,000), నాల్గవ స్థానంలో ఓంకారం జట్టు(రూ. 3,000) నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, టీడీపీ నందికొట్కూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి బహుమతులు అందజేశారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

- ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు
- స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం



స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా ఆలయ ప్రధాన వీధుల్లో శుభ్రం చేస్తున్న ఈఓ శ్రీనివాసరావు, తదితరులు

శ్రీశైలంటెంపుల్: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని, క్షేత్రాన్ని శుభ్రంగా ఉంచేందు కు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా గురువారం క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.పారిశుద్ధ్య నిర్వహణకు గానూ క్షేత్రా న్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించారు. ప్రతీ జోనుకు దేవస్థానం శాఖాధిపతులను, విభాగాల పర్యవేక్షకులను ప్రత్యేక అధికారు లుగా నియమించారు. ఆయా జోన్లలో పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. కార్యక్రమంలో పలు ప్రధాన రహదారులు ఆలయ మాడ వీధులు, గంగాధర మండపం నుంచి తూర్పువైపున నందిగుడి వరకు ఉన్న ప్రదేశం, దక్షిణం వైపున అలంకారేశ్వరాలయం ఉన్న ప్రదేశం, దర్శన క్యూకా ంప్లెక్సు, విరాళాల సేకరణ కేంద్ర ప్రాంగణం, పరి సరాలు, అన్నప్రసాద వితరణ భవనం, సీఆర్ఓ కా ర్యాలయం, దేవస్థానం వైద్యశాల, గంగాగౌరీసదన్, మల్లికార్జునసదన్, గణేశ సదన్, టూరిస్ట్ బస్టాండ్ పరిసరాలు, సెంట్రల్ పార్కింగ్ ప్రదేశం, మల్లమ్మ కన్నీరు, పంచమఠాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సర్వతోభద్రవన, కల్యాణ కట్ట, పాతాళగంగ పాతమెట్ల మార్గం, ఆర్టీసీ బస్టాండు, సిద్ధిరామప్ప వాణిజ్య సముదాయం, పాతాళగంగ మెట్లమార్గం, పాతాళగంగ స్నానఘట్టాలు, భ్రమరాంబా అతిథిగృహం, సాక్షి గణపతి ఆలయం, హాటకేశ్వరాలయం, పాలధార-పంచధార, శిఖరేశ్వర ఆలయ పరిసరాలు తదితన 66 చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎం.రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.నరసింహారెడ్డి, పలువురు సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల కేంద్రాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్

ఆత్మకూరు: విద్యుత్ వినియోగదారుల కేంద్రాన్ని పట్టణంలోనే కొనసాగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్, ఇస్మాయిల్, వీరన్న డిమాండ్ చేశారు. గురువారం డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి విద్యుత్ వినియోగదారుల కేంద్రం కొనసాగుతుండేదని, ఇటీవల దాన్ని తొలగించడంతో మూడున్నర కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. వినియోగదారుల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ వినియోగదారుల కేంద్రాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: సంక్రాంతి సందర్భంగా సున్నిపెంటలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను గురువారం రెడ్ల సంక్షేమ సంఘం నాయకులు గొల్మార్ ఎల్లారెడ్డి, కాతా రామిరెడ్డి ప్రారంభించారు. సున్నిపెంట యూత్ ఆధ్వర్యంలో సెంట్రల్ లోకాలిటీ పాఠశాలలో జరగనున్న పోటీలకు వైజాగ్, అనంతపురం, కర్నూలు, తాండ్రపాడు, సున్నిపెంట, తెలంగాణ రాష్ట్రం అచ్చంపేట నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.40,000, రెండవ బహుమతిగా రూ.30,000, మూడవ బహుమతిగా రూ.20,000, నాలుగవ బహుమతిగా రూ.10,000లను ఆర్గనైజర్లు మురళీకృష్ణ, ఇన్‌షాద్, ఆనంద్‌బాబు, కాశి, పవన్‌లు అందించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉమామహేశ్వరరావు, రాజశేఖర్, శ్రీనివాసులు, అచ్యుత్, రూపస్, సుభాని పాల్గొన్నారు.

సర్వేలను పూర్తి చేయండి



పంచాయతీ కార్యదర్శులకు సలహాలిస్తున్న ఎంపీడీఓ గోపికృష్ణ

జూపాడుబంగ్లా: ఎన్‌పీసీఐ, హౌసింగ్ మ్యాపింగ్, ఎంఎస్‌ఎంఈ సర్వేలను త్వరగా వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ గోపికృష్ణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌పీసీఐ బ్యాంకు లింకింగ్ సర్వే, హౌసింగ్ జియోట్యాగింగ్, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే కొనసాగుతున్నట్లు తెలిపారు. మండలం వ్యాప్తంగా 12,712 ఇళ్లు ఉండగా ఇప్పటిదాకా 99 శాతం ఇళ్లు జియోట్యాగింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్స్ ఆఫ్ కార్పొరేషన్ ఇండియా) బ్యాంకు లింకప్ ఖాతాలు 2,784 ఉండగా వాటిల్లో 98 శాతం ఖాతాల లింకప్ పూర్తిచేసినట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో లింకప్ చేయించుకోవటం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు ఖాతాల్లో డీబీటీ పద్ధతి ద్వారా నగదు జమచేయటం సులభతరం అవుతుందన్నారు. లింకప్ చేయించుకోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీబీటీ పద్ధతిలో అందించే నగదు బ్యాంకు ఖాతాల్లో జమకాదన్నారు. మండల వ్యాప్తంగా 554 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇప్పటి దాకా 90 శాతం మేర పూర్తిచేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని త్వరగా పూర్తిచేసి వంద శాతం మేర సర్వేలన్నీ పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ ఆదేశించారు. గ్రామాల్లో చెత్తాచెదారం, మురికినీటి నిల్వల్లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి ట్యాంకులను పక్షం రోజులకోసారి తప్పనిసరిగా శుభ్రం చేయించి తాగునీటి పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

వివాదాస్పదమైన మహిళా కబడ్డీ ఫైనల్ విజేత ఎంపిక

పగిడ్యాల: తూర్పు ప్రాతకోట నాగేశ్వరస్వామి తిరుణాలను పురష్కరించుకుని నిర్వహించిన జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు వివాదాస్పదమయ్యాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన రెఫరీలు ఆంధ్ర కబడ్డీ జట్టు వైపు మొగ్గు చూపి విజేతగా నిలిచిన హర్యానా జట్టుకు మోసం చేయడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఫైనల్ పోటీలో అంపైరింగ్ జట్టు అయిన ఆంధ్ర జట్టు, హర్యానా జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగుతున్న ఫైనల్ పోటీల్లో హర్యానా జట్టు, ఆంధ్ర జట్టు చెరి 12 పాయింట్లతో సమానంగా నిలిచాయి. అయితే ఆంధ్ర జట్టుకు అదనంగా ఒక రైడ్‌ను కేటాయించడంతో హర్యానా జట్టు సభ్యులు, క్రీడను ఆస్వాదించడానికి వచ్చిన ప్రేక్షకులు పెద్ద ఎత్తున మోసం.. మోసం అంటూ చేసిన నినాదాలతో నాగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. హర్యానా జట్టే విజేత అని రెఫరీలు పక్షపాతంగా వ్యవహరించి ఆంధ్ర జట్టును విజేతగా ప్రకటించడాన్ని పలువురు వ్యతిరేకించారు. అంతలోనే రథోత్సవ కార్యక్రమానికి హాజరైన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి హర్యానా క్రీడాకారులు తీసుకెళ్లి అంపైర్ల నిర్ణయాన్ని వ్యతిరేకించారు. క్రీడాకారుల ఆవేదనలో ఉన్న నిజాయితీని గుర్తించిన ఎంపీ బైరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి రెండు జట్లను జాయింట్ విన్నర్‌గా ప్రకటించి చెరో రూ.30 వేలు ప్రైజ్ మనీ ఇవ్వాలని సూచించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

క్షేమంగా గమ్యస్థానాలు చేరుకోండి

- ఎంవీఐ సత్యనారాయణ రెడ్డి



ప్రసంగిస్తున్న ఎంవీఐ ఏఎస్ఎన్ రెడ్డి

ఆత్మకూరురూరల్: రహదారి భద్రతా నియమాలను పాటిస్తు వాహనదారులు, ప్రయాణికులు క్షేమంగా గమ్యాలకు చేరుకోవాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ.సత్యనారాయణ రెడ్డి సూచించారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో గురువారం రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. వేగనియంత్రణ, రహదారి సూత్రాలను పాటించడం ద్వారా ప్రమాదాల శాతాన్ని తగ్గించవచ్చన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్‌లకు వాహనాలు నడిపితే వారి పెద్దలపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వినయ్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పించాలి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో వాహన చోదకులను భాగస్వాములు చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, ఫ్లెక్సీని కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలలో జాతీయ, రాష్ట్ర రహదారులకు సంబంధించిన బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను ప్రాముఖ్యతను వివరించడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించి ప్రమాదాలు నివారణకు కృషి చేయాలని సూచించారు.

ఆగిఉన్న బైక్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరు చిన్నారులకు స్వల్పగాయాలు

మహానంది: రోడ్డుపక్కన ఆగిఉన్న బైకును వేగంగా వెళ్తున్న కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన భక్తులు గురువారం ఎక్స్‌యూవీ-500 వాహనంలో మహానందికి బయలుదేరారు. శ్రీనగరం వద్ద డ్రైవర్ రాజ్‌కుమార్ స్పీడ్ కంట్రోల్ చేయలేక రోడ్డు పక్కనే ఆగివున్న బైకును ఢీకొట్టాడు. ఆ తర్వాత చెట్టును ఢీకొట్టడంతో కారు ఆగిపోయింది. ప్రమాదంలో బైక్, కారు దెబ్బ తిన్నాయి. కారులో ఉన్న ఇద్దరు చిన్నపిల్లలకు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాజులపల్లెకు చెందిన గౌండా హుసేన్‌బాషా బైకుగా గుర్తించారు. రెండు వాహనాల వారు మాట్లాడుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

ప్రతి ఒక్కరికీ చదువు అవసరం

కొత్తపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరికీ చదువు ఎంతో అవసరమని వెలుగు ఏరియా కో- ఆర్డినేటర్ ఎం పుల్లయ్య, అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లిలో ఉన్న మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్‌కు సంబంధించి వలంటీర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరికీ కనీసం అక్షరజ్ఞానం తెలిసే విధంగా చదువు అవసరమన్నారు. గ్రామాల్లోని వలంటీర్ ట్రైనర్స్ అభ్యాసకుల ఓపిక, తెలివి ఆధారంగా చదువు నేర్పించాలన్నారు. పుస్తకాలు, వీడియోల ద్వారా చదువు చెప్పడం వల్ల సులువుగా అర్థమవుతుందన్నారు.

రుణాల రికవరీ చేపట్టాలి

జూపాడుబంగ్లా: పొదుపు సంఘాల్లోని మహిళలకు ఇచ్చిన శ్రీనిధి, బ్యాంకు లింకేజీ, తదితర రుణాల రికవరీని వీఓఏ(బుక్‌కీపర్లు) సక్రమంగా చేపట్టాలని ఏపీఎం అంబమ్మ ఆదేశించారు. గురువారం వెలుగు కార్యాలయంలో బుక్‌కీపర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ బుక్‌కీపర్లు వారి పరిధిలోని గ్రామైక్య సంఘాల ద్వారా పొదుపు మహిళలకు ఇచ్చిన రుణాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా రికవరీ చేయించాలన్నారు. బకాయిలు చెల్లించిన వారికి రశీదులు ఇవ్వటంతోపాటు వారి పేరున ఆన్‌లైన్‌లో రుణం చెల్లించినట్లుగా నమోదు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడినా సహించేదిలేదన్నారు.

బిల్లులు మంజూరు చేయాలి

పాములపాడు: మినీ గోకులం షెడ్డు బిల్లులు మంజూరు చేయాలని మండలంలోని మిట్టకందాల గ్రామానికి చెందిన రైతులు వెంకటేశ్వర్లు, పెద్ద యాకోబు గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించారు. 2019 ఫిబ్రవరి 2న మినీ గోకులం షెడ్డు మంజూరైందన్నారు. నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు మొత్తం చెల్లిస్తామని చెప్పి, ఇప్పటి వరకు రూ.80 వేలు మాత్రమే తన బ్యాంకు ఖాతాలో జమ చేశారన్నారు. మిగతా రూ.లక్ష చెల్లించాలని ఎంపీడీఓను కోరారు. ఆయన స్పందిస్తూ పశువైద్యాధికారిణిని కలవాలని రైతులకు సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్యకళావేదికపై ఒంగోలుకు చెందిన నటరాజ కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. గణపతి ప్రార్థన, శివతాండవం, శివశివశంకరా, శివోహం, లింగాష్టకం కాలభైరవాష్టకం తదితర అష్టకాలకు, గీతాలకు నాగచరిత్ర, భవ్యశ్రీ, రూపాలహరి, సుష్మ, హారిక, స్నేహ, కార్తికేయని, బిందుప్రియ, తేజ, అక్షిత, తనూజ, జాహ్నవి తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

21న జాబ్‌మేళా

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం జాబ్ మేళా కరపత్రాలను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో హీటిరో ల్యాబ్, ఆస్తో టెక్ స్టీల్, ఏపీటీయూఎఫ్ వాల్వా హెచ్ఎఫ్‌సీ ఇండియా లిమిటెడ్, సన్‌కిసాన్ అగ్రీ అండ్ కో కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 97059 98057, 86886 51650 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ముగిసిన తాండవ మల్లేశ్వరుడి తిరునాల

- ఘనంగా పారువేట ఉత్సవం



పారువేట ఉత్సవానికి ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఈనెల 13 నుంచి మండల కేంద్రంలో కొనసాగుతున్న పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పారువేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు మల్లికార్జున ఆచారి, గ్రామ పూజారి లక్ష్మీనరసయ్య శర్మ ఉదయం స్వామి అమ్మవార్లకు బిందెసేవ, అభిషేకం, కంకుమార్చన, రుద్రాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నందీశ్వరుని పల్లకీలో కొలువుంచి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేర వరకు పారువేట ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామ సర్పంచు బోర్రబోయిన లక్ష్మీదేవి, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్

నందికొట్కూరు: రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరమని టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలు డీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదమన్నారు. ప్రజలకు, ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి వాటి నివారణ కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతాయన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాస్తే గమ్యానికి క్షేమంగా చేరుకోవచ్చన్నారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్ఐ జప్రుల్లా హెచ్చరించారు. గురువారం కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ శాఖ ఎస్ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారాను కూడా ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేయడం నేరమన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులతోపాటు వాహనాలు సీజ్ చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు. దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుమారి, పోలీసులు శివన్న, సుధీర్‌కుమార్, మధుప్రసాద్, రమిజా పాల్గొన్నారు.

అంధకారంలో తాటిపాడు రోడ్డు



తాటిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు

- నెల రోజుల నుంచి వెలగని వీధిదీపాలు
- రాత్రి వేళల్లో మందుబాబులతో ఇబ్బందులు పడ్తున్న ప్రజలు

జూపాడుబంగ్లా: కేజీ రోడ్డు నుంచి తాటిపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు నెల రోజుల నుంచి అంధకారంగా ఉండటంతో గ్రామానికి వెళ్లేందుకు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కర్నూలు-గుంటూరు రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో తాటిపాడు గ్రామం ఉంది. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు, వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లిన గ్రామస్తులు జూపాడుబంగ్లా ఆర్టీసీ బస్టాండు వద్ద దిగుతారు. అక్కడి నుంచి గ్రామానికి కిలోమీటరు మేర కాలినడకన నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంది. గ్రామానికి వెళ్లే రహదారి వెంట ఉన్న విద్యుత్ దీపాలు నెలరోజుల నుంచి వెలగకపోవటంతో రాత్రి వేళల్లో గ్రామానికి చేరుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు గ్రామానికి వెళ్లే దారి వెంట మందుబాబులు తిష్ట వేసి మద్యం తాగుతుండటంతో ఎప్పుడు ఎలాంటి సమస్యను ఎదుర్కొవాల్సి వస్తుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. వారం క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్యాబ్లెట్లు తెచ్చుకునేందుకు బైక్‌పై జూపాడుబంగ్లాకు వెళ్తుండగా తాగుబోతులు అతన్ని అటకాయించి భయాందోళనకు గురిచేశారు. ఎట్టకేలకు వారి నుంచి తప్పించుకుని గ్రామస్తులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చేలోగా మందుబాబులు అక్కడి నుంచి ఉడాయించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సర్పంచు, విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుని తాటిపాడు గ్రామానికి వెళ్లేదారి వెంట విద్యుత్ దీపాలు వెలిగించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండలంలోని హరినగరం సమీపంలో బుధవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు పోలీసులు, మరో యువకుడు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి అహోబిలంలో పార్వేట ఉత్సవాలు మొదలయ్యాయి. కార్యక్రమానికి బందోబస్తుగా దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌ను చెందిన సిబ్బంది కొందరు వెళ్లారు. కార్యక్రమం ముగియడంతో కానిస్టేబుళ్లు చిన్న మాధవ, రాముడు ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో రుద్రవరం నుంచి రమణ, ఇమాం,వుశేన్‌బాషా అనే ముగ్గురు మోటర్ సైకిల్‌పై పార్వేట ఉత్సవాలు తిలకించేందుకు వెళ్తున్నారు. రెండు బైక్‌లు హరినగరం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో చిన్న మధు అనే పోలీస్‌కు తీవ్రగాయాలు కాగా, మరో పోలీస్ రమణ, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: నంద్యాల మండలం కానాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్ధన్‌రెడ్డి (50) గురువారం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం ఎం. చింతకుంట్ల గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి నంద్యాల పట్టణానికి పని నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. కానాల శివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ప్రమాదంలో జనార్ధన్‌రెడ్డి తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.